

## రోడ్డు మీదే చెత్త పట్టింపేది..!

సిటీ బ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): లంగర్ హౌజ్ నుంచి నార్సింగి వెళ్లే దారిలో ఇంబ్రహీం బాగ్ దాటగానే వాహనదారులు దుర్వాసన భరించలేక పోతున్నారు. తారామతి సమీపంలో రోడ్డుపైనే చేపల వ్యర్థాలు, దుకాణాల వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా డంపింగ్ చేస్తున్నారు. దీంతో చేపల వ్యర్థాలు కుళ్లిపోయి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నది. నెలల తరబడి అక్కడ చెత్త వేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.



# రాబందులు అంతరించిపోకుండా..

జూపార్క్‌లో సంతానోత్పత్తి కేంద్రం ప్రారంభం

### హర్యానా నుంచి పక్షుల స్వీకరణ .. 24 రాబందులను బదిలీ చేయాలని నిర్ణయం

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : అంతరించిపోతున్న రాబందుల జాతులను కాపాడటానికి నెహ్రూ జులాజికల్ పార్క్(ఎన్‌జెడ్‌పీ) త్వరలో ఒక ప్రత్యేక సంతానోత్పత్తి కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లోని జూ దాని ప్రాంగణంలో ఉన్న ప్రత్యేక సంతానోత్పత్తి కేంద్రంలో వైట్ బిల్ట్ రాబందు, లాంగ్‌బిల్ట్ రాబందు, సన్నని బిల్డ్ రాబందుల పెంపకాన్ని చేపట్టనుంది. జూ అధికారులు త్వరలో హర్యానాలోని పింజోర్‌లోని జటాయూ కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్ నుంచి ఈ స్కావెంజర్ పక్షులను స్వీకరించనున్నారు. సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల 10 తెల్లటి వెనుక గల రాబందులు,10 పొడవైన బిల్డ్ రాబందులు, నాలుగు సన్నని బిల్ట్ రాబందులను హైదరాబాద్ జూకు బదిలీ చేయాలని నిర్ణయించింది. చనిపోయిన జంతువుల కళేబరాలను తిని, అంటువ్యాధుల వ్యాప్తిని తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలో సహాయపడే ఈ పక్షులను.. వాటి జనాభా తగ్గుతున్నందున ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయూసీఎన్) తీవ్రంగా అంతరించిపోతున్న జాతుల జాబితాలో చేర్చింది. ప్రస్తుతం, హైదరాబాద్ జూలో రాబందులు ఉన్నాయి. కానీ అవి పాతవి, వాటితో సంతానోత్పత్తి చేయలేవు.దీంతో పింజోర్ నుంచి హైదరాబాద్‌కు రాబందుల బదిలీని సెంట్రల్ జూ అథారిటీ ఆమోదించింది. త్వరలో వాటిని తీసుకువచ్చి సంతానోత్పత్తి ప్రారంభిస్తామని తెలంగాణ జూ పార్క్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరేమత్ అన్నారు.




### మూషిక జింకల సంతానోత్పత్తి విజయవంతం..

2010లో మూషిక జింకల పెంపకాన్ని నెహ్రూ జూలాజికల్ పార్క్ విజయవంతంగా నిర్వహించడంతో ఇప్పటివరకు వాటిలో 264 తిరిగి అడవిలోకి ప్రవేశపెట్టామన్నారు. జంతు మార్పిడి కార్యక్రమాలలో 74 మూషిక జింకలను ఇతర జంతు ప్రదర్శనశాలలకు బదిలీ చేశామన్నారు.మరో ఏడు వేర్వేరు ప్రదేశాలలో తిరిగి వాటిని పెంచుతున్నామని,ప్రస్తుతం జూలో 129 మూషిక జింకలు ఉన్నట్లు జూపార్క్ అధికారులు తెలిపారు.

### 2010 నుంచే రాబందుల పెంపకం..

రాబందుల పెంపకం 2010 నాటిది. అప్పటికి జూలో ఉన్న ఐదు వైట్ బిల్ట్ రాబందులతో ప్రారంభమైంది. రెండు మగ,మూడు ఆడ రాబందులు ఉన్నాయి. వీటికి తోడుగా 2014-15లో గుజరాత్‌లోని సక్కర్‌బాగ్ జూ నుంచి ఆరు రాబందులను తీసుకువచ్చారు. నెహ్రూ జూలాజికల్ పార్క్‌కి భారీ విజయంగా ఉన్న ఎలుక జింకల పెంపకం వలె కాకుండా,ఒక కోడిపిల్లగా పొదిగిన ఒక గుడ్డు 85 రోజుల తర్వాత పుట్టుకతో వచ్చే లోపం కారణంగా సంతానోత్పత్తి విజయవంతం కాలేదు. దీంతో రాబందుల పెంపకం అంతగా విజయవంతం కాలేదు. పక్షి సంవత్సరంలో ఒక గుడ్డు మాత్రమే పెడుతుంది. దీనిని కాపాడటానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ దానికి పుట్టుకతో వచ్చే లోపంతో మరణించిందని జూ పార్క్ అధికారిక వర్గాలు తెలిపాయి.

## ప్రజావాణికి 80 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

సిటీ బ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, డాక్టర్ ముకుంద రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వారు మాట్లాడుతూ అన్ని విభాగాలకు కలిపి 80 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్ఓ వెంకటి, డీఈఓ ఆర్ రోహిణి ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం, సీపీఓ సురేందర్, రాజేందర్, శ్రీరామ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులకు లభించని మోక్షం

మేడ్చల్, మార్చి10(నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులకు మోక్షం లభించడం లేదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో నామ మాత్రంగానే నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు దారులు ఆరోపిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదులు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేకపోవడంతో కలెక్టరేట్‌కు మళ్లీ రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. వేలాది సంఖ్యలో ఫిర్యాదులకు మోక్షం లభించడం లేదని తెలుస్తోంది. అవే దరఖాస్తులు వస్తుంటే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తే ఫిర్యాదులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రోజు జరిగిన ప్రజావాణిలో 55 ఫిర్యాదులను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు.



## శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై శిక్షణ

సిటీ బ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని దూలపల్లి అటవీ జీవవైవిద్య సంస్థ రైతులకు అటవీ కళాశాల, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తేనెటీగల పెంపకం, ఆవశ్యకత, ఉపయోగాలు, తేనె ప్రాసెసింగ్, మార్కెటింగ్, వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాస్త్రవేత్తలు డాక్టర్ దీప, డాక్టర్ పంకజ్‌సింగ్, డాక్టర్ శ్రీకాంత్, అటవీ జీవవైవిద్య సంస్థ నుంచి డాక్టర్ శైలజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కండక్టర్ చిరంజీవి, శ్రీ నేచురల్ హనీ ఫౌండర్ సంజన తదితరులు పాల్గొన్నారు.

## మొరాయించిన సర్వర్



ఘట్ కేసర్, మార్చి 10: ఘట్ కేసర్ పట్టణంలోని ఓఆర్ఆర్ టోల్ ప్లాజా ఎగ్జిట్ నంబర్ 9 వద్ద సోమవారం సాయంత్రం అరగంటకు పైగా సర్వర్ మొరాయించింది. దీంతో హైదరాబాద్, వరంగల్ వైపు వెళ్లే వాహనాలతో పాటు ఓఆర్ఆర్ పైకి వెళ్లే వాహనాలు నిలిచి పోయాయి. సర్వర్ మొరాయించి స్కాన్ కాకపోవటం వల్ల వందలాది వాహనాలు నిలిచి పోయాయి. కిలోమీటర్ కు పైగా వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి సర్వర్ డౌన్ కు కారణమైన సమస్యను పరిష్కరించటంతో ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

## అపోలో ఆస్పత్రిలో స్టాట్-2025 సదస్సు

సిటీబ్యూరో, మార్చి10,(నమస్తే తెలంగాణ): మానవుడి రక్తం గడ్డకట్టడం వాటి వల్ల సంభవించే హాని గురించి అపోలో ఆసుపత్రి రెండు రోజుల పాటు స్టాట్-2025 సదస్సును నిర్వహించింది. ఈ సదస్సుకు తెలంగాణ డీజీపీ జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, తెలంగాణ ప్రాంత సీఈఓ తేజస్వీరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో గ్రూప్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగీతరెడ్డి మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన స్ట్రోక్‌లు వైకల్యం, మరణాలకు దారితీస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో యుఎస్ఏ,స్పెయిన్, స్విట్జర్లాండ్, సింగపూర్, టర్కీ దేశాల నుంచి హాజరైన అంతర్జాతీయ అధ్యాపకులతో పాటు 650మందికి పైగా ప్రతినిధులుపాల్గొన్నారు,




## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, ఎప్పటికప్పుడు పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 79 విన్నపాలు రాగా, ఆరు జోన్లలో 108 అర్జీలు అందగా, అందులో కూకట్‌పల్లిలో 56, సికింద్రాబాద్‌లో 13, శేరిలింగంపల్లిలో 18, చార్మినార్, ఎల్బీనగర్‌లో10, ఖైరతాబాద్ జోన్‌లో ఒక్క ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సీసీపీ శ్రీనివాస్, సీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ పద్మజ, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, అడిషనల్ సీసీపీ గంగాధర్, జోనల్ సీపీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్స్ ఫలితాలు నిలిపివేయాలనడం సరికాదు



నినదిస్తున్న మాల సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగిన తర్వాతనే గ్రూప్స్ పరీక్షల ఫలితాలు వెల్లడించాలని మందకృష్ణ మాదిగ మాట్లాడటం సరికాదని వివిధ మాల సంఘాల నాయకులు అన్నారు. మందకృష్ణ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాల యూత్ ఫెడరేషన్ చైర్మన్ మందాల భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ ప్రెసిడెంట్ మాదాసు రాహుల్ రావు, అంసా ఓయూ ప్రెసిడెంట్ నామ సైదులు మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఫలితాలను షెడ్యూల్ ప్రకారమే విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మద్దెల రాజు, సింగి శ్రీకాంత్, మాల శేఖర్, గండమల్ల శ్రీకాంత్, సంఖ్య శివకుమార్, సుధాకర్, గంగారాం, రఘు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ కవచాలను పంపిణీ చేయాలి




మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

మన్సురాబాద్, మార్చి 10: కల్లుగీత కార్మికుల ప్రమాద నివారణకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాలను వెంటనే పంపిణీ చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. తాటి చెట్టు పైనుంచి కిందపడి ప్రమాదానికి గురై నాగోల్ సుప్రజా దవాఖానలో చికిత్స పొందుతున్న జనగామ జిల్లాకు చెందిన కోడూరు గ్రామస్తుడు బాల్న శ్రీనివాస్ గౌడ్, పెద్ద మడ్డూరు గ్రామానికి చెందిన గోడిశాల శ్రీనివాస్, గొల్లపల్లి గ్రామానికి చెందిన తీగల పరశురాములను సోమవారం రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు పరామర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది కల్లుగీత కార్మికులు ఉండగా మొదటి విడుతలో 25 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు అందజేస్తామని చెప్పినప్పటికీ అందులో కేవలం 18 వేల మందికి మాత్రమే రక్షణ కవచాలు అందాయన్నారు. కల్లుగీత కార్మికులకు ఇప్పటివరకు రూ. 7.90 కోట్ల ఎక్స్ గ్రేషియా అందాల్సి ఉండగా ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోలగాని జయరాములు, వెంకట నరసయ్య, వెంకట మల్లయ్య, కార్యదర్శి సీతారాములు, బోయపల్లి సుధాకర్, పరిధుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పనికి తగిన వేతనం ఇవ్వాలి

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, పనికి తగిన వేతనం, కార్మిక చట్టాలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ సోమవారం కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. నాలుగు సంవత్సరాల క్రితం అరకొరగా జీతాలు పెంచి నేటికి కూడా వీరి జీతాలు పెంచకపోవడం తీవ్ర అన్యాయమని, కార్మికుల శ్రమ ద్వారా మహానగరంలో అధిక ఆదాయం వస్తున్నప్పటికీ జీతాలు మాత్రం అతి తక్కువ చెల్లిస్తున్నారని అన్నారు. మలేరియా స్కీంలో గతంలో ఉన్న మూడు కేటగిరీల వారీగా జీతాలను అమలు చేయాలని, మూడు కేటగిరీలకు విడివిడిగా జీతాలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## నిలకడగా శ్రీతేజ్ ఆరోగ్యం

సిటీ బ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని కిమ్స్ వైద్యులు తెలిపారు. సోమవారం శ్రీతేజ్ హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ప్రస్తుతం ఆయన ఆక్సిజన్ లేకుండా వెంటిలేటర్ సపోర్ట్ లేకుండా స్వతంత్రంగా శరీర సంకేతాలను నియంత్రిస్తున్నాడని చెప్పారు. 10 రోజుల క్రితం ఎండోస్కోపిక్ గ్యాస్ట్రోస్ట్రోమీ నిర్వహించగా, పునరావాస చికిత్స కొనసాగుతున్నదని తెలిపారు. కుటుంబ సభ్యులను గుర్తించలేకపోయినా, గ్యాస్ట్రోస్ట్రోమీ ట్యూబ్ ద్వారా ఆహారం తేలికగా జీర్ణించుకుంటున్నాడని వెల్లడించారు.

## ఎన్యూమరేటర్లకు ఇన్సెంటివ్ ఇవ్వలేదు



అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 10: సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేసి మూడు నెలలు పూర్తయినప్పటికి ఇన్సెంటివ్ ఇవ్వలేదని సీఐటీయూ నాయకుడు ఉన్నీ కృష్ణన్ అన్నారు. ఇన్సెంటివ్ ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే కు ఇన్సెంటివ్ ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు రూ. 10 వేలు ఇస్తామని అధికారులు ప్రకటించారని ఇంతవరకు ఇవ్వలేదని అన్నారు.

## ఎంఎల్ఆర్ఐటీకి వన మహోత్సవ్ అవార్డు



అవార్డును తిలకిస్తున్న మర్రి లక్ష్మణ్ రెడ్డి, తదితరులు

దుండిగల్, మార్చి 10: దుండిగల్ లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్‌ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ ఐటీ) కళాశాలకు వన మహోత్సవ్ అవార్డు దక్కినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. రాష్ట్రాన్ని ఆకుపచ్చగా మార్చే వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం-2024వ సంవత్సరంలో అత్యధిక మొక్కలు నాటి వాటిని సంరక్షించినందుకుగాను కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ వారు మార్చి 8న ఐటీసీ కాకతీయ హోటల్లో నిర్వహించిన సీఐఐ వార్షిక సదస్సులో వన మహోత్సవ్ అవార్డును సీఐఐ తెలంగాణ స్టేట్ చైర్మన్ సాయి ప్రసాద్ ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల ప్రతినిధులకు అందజేశారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి , ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు దేవదాసు

చిక్కడపల్లి,మార్చి 10 : చేనేత మగ్గాన్ని అవమాన పరిచిన సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరిగిన పద్మశాలి మహాసభ లో పద్మశాలీల చేనేత కళాకారుల, కార్మికుల పవిత్రమైన చేనేత మగ్గంపై సీఎం రేవంత్ రెడ్డి కాళ్లకు నల్ల బూట్లు వేసుకొని చేనేత మగ్గం నేసిన తీరును నిరసిస్తూ సోమవారం అశోక్ నగర్ లోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్, మార్గం అమర్, వంశీ చింతకింది, బల్లా ప్రశాంత్ పాల్గొన్నారు

## సీఎం రేవంత్ మాటలు సిగ్గుచేటు



నినదిస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడితే సహించబోమని ఓయూ జేఏసీ నేతలు హెచ్చరించారు. రాష్ట్రం అప్పుల కుప్పగా ఉందని జాతీయ మీడియా ముందు హేళనగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ సీఎంగా తన చేతిలో రూ. 500 కోట్లు కూడా లేవని హేళనగా మాట్లాడటం ఆయన మానసిక స్థితికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక అంశాల మీద అవగాహన లేక, అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని తక్కువ చేస్తూ రాష్ట్ర పరువు తీస్తున్నారని మండిపడ్డారు. 6 గ్యారెంటీలు 13 హామీలు అమలు పరచడం చేతకాక అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని అభాసుపాలు చేస్తూ మాట్లాడడం దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అగ్రస్థానంలో ఉన్నట్టుగా ఆర్బీఐ నివేదికలు, సర్వే సంస్థలు కుండబద్దలు కొట్టినట్టుగా చెబుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నేతలు దత్తాత్రేయ, మంతెన మధు, పెద్దమ్మ రమేశ్ ముదిరాజ్, శ్యామ్, రామకృష్ణ, శ్రీకాంత్, అనిల్ ప్రజాపతి, కోడూరు రఘు, దయాకర్, పాల్గొన్నారు.

## శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి



మాట్లాడుతున్న డీఎంఆర్‌ఎల్ డైరెక్టర్ డాక్టర్ బాలమురళీకృష్ణన్

చర్లపల్లి, మార్చి 10 : ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించిందని డీఎంఆర్‌ఎల్ డైరెక్టర్ డాక్టర్ బాలమురళీకృష్ణన్ తెలిపారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ పరిశోధన సంస్థ సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ(సీమెట్) వ్యవస్థాపక దినోత్సవాన్ని బ్రహ్మోస్, ఏరోస్పేస్ వ్యవస్థాపక సీఈఓ డాక్టర్ శివధాను పిళ్ళై, గ్రూప్ కో ఆర్డినేటర్ సునీత వర్మ, సీమెట్ డైరెక్టర్ జనరల్ మగేశ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమెట్ తయారు చేసిన హాఫ్నియం స్పాంజ్ పదార్థం రాకెట్ నాజల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని, బ్యాటరీ పదార్థాలు, గ్రాఫిక్, పరిశుభ్ర లోహాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాలలో సెమికండక్టర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీమెట్ డైరెక్టర్ డాక్టర్ రితీశ్, రాజేశ్‌కుమార్, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్ లో పార్కింగ్ పాట్లు

ఖైరతాబాద్, మార్చి 10: నిమ్స్ దవాఖానలో ప్రధాన రహదారిలో భారీగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం 2 వేల నుంచి 3వేల మంది రోగులు చికిత్సకు వస్తుంటారు. పంజాగుట్ట గేటు నుంచి బంజారాహిల్స్ రోడ్ నం.1కు వెళ్లేందుకు కొందరు వాహనదారులు ఇదే దారిని ఉపయోగించుకుంటుండడంతో సమస్య మరింత జఠిలమవుతుంది. పార్కింగ్ నిర్వాహకులు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధ్యతరగతి ప్రజలు నిమ్స్ కు వస్తే పార్కింగ్ రూపంలో వారి జేబులకు చిల్లు పడుతోంది. ముఖ్యంగా కార్లను కిరాయికి తీసుకొని నిమ్స్ వచ్చే వారు కేవలం పార్కింగ్ కోసమే కొంత డబ్బు పక్కకు పెట్టుకోవాల్సి వస్తోంది. నిమ్స్‌లో ఉచితంగా పార్కింగ్ చేసుకునే వీలు కల్పించాలని రోగుల సహాయకులు కోరుతున్నారు.



నిమ్స్ ప్రధాన గేటు దారిలో రెండు వైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

## ముగిసిన జాతీయ ఓపెన్ టెన్నిస్ టోర్నీ

బంజారా హిల్స్, మార్చి 10: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 21వ జాతీయ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ విజేతలకు జూబ్లీహిల్స్ రిక్రియేషన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వర్ రావు, దగ్గుపాటి వేంకటేశ్వర రావు బహుమతులు అందజేశారు. హైదరాబాద్ తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 426 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల నరసింహారెడ్డి తెలిపారు.

